రమాకాంతరావుగారు ఉలిక్కిపడ్డారు!

జేబులోకి వెళ్ళినచేయి అలాగే ఉండిపోయింది. పిడికిలిలో ఇరుకున్న జేబులోని ఆ బరువైన వస్తువు విలవిలలాడింది. మొఖంమీద చిరు చెమట పట్టింది. కాళ్ళు వణికినయి. హృదయం భయంతో మూలి గింది. ఆయన అచేతనులయ్యారు!

తన జేబులోని ఆ పర్సు ఎవరిది?

అది తన జేబులోకి ఏలా వచ్చింది?

కాళ్ళు నిలువలేదు......

క్షణంలో ఇందాక జరిగిన సంఘటన గుర్తు కొచ్చింది......అది— అదేగాదుగదా ఇది?

—ఒక సిల్కు లాల్చీ వేసుకున్న మధ్య వయః స్కుడు కారు ఎక్కబోతూ, "దొంగ! దొంగ!" అని అరిచాడు పెద్దగా రోడ్డుమీద. కన్నుమూసి తెరిచే లోగా జనం చుట్టేశారు.

"ఎక్కడ? ఎక్కడ?"

గంద్రగోళమై పోయింది. జనమంతా హడావుడిగా పరుగెత్తారు. 'బీటు కానిస్టేబుల్స్' జనంగుంపులు గూడినచోటుకు ఉరకలు వేశారు. తనూ విచిత్రంగా నోరు తెరుచుకొని ఆ దృశ్యంవంకే చూస్తున్నాడు.

నాలుగు నిముషాలు ఎవరి కిష్టమొచ్చినట్లు వాళ్ళు మాట్లాడారు.

దొంగ దొరకలేదు!

పోలీసులు గళ్ళచొక్కా తొడుక్కొని, జుట్టు మొఖంమీద చిందర వందరగా పడుతున్న ఒక యువ కుడిని 'యక్ష ప్రశ్నల'తో దబాయిస్తున్నారు.

ఆ పర్సు పోగొట్టుకున్న మధ్య వయస్కుడు నిర్లక్ష్యంగా తన చుట్టూ మూగివున్న జనాన్ని చూసి, తలుపు తీసుకొని కారులో కూర్చొని, "పోనియ్!" అన్నాడు.

కారు 'రంయ్‌న' దూసుకుంటూపోయింది.

అందరూ అతడి తీరుకు ఆశ్చర్యపోతూ, అలాగే నిలబడిపోయారు!

ఆ పర్సులో ఏమంతగా డబ్బు లేదేమో అనే అను మానం అందరిలోనూ కలిగింది......

ఎవరిదారిన వాళ్ళు వెళ్ళిపోయారు....

ఆ పర్సేకాదుగదా ఇది?

ఆమాట అనుకున్నప్పుడు మరొకసారి కాళ్ళు వణికినయి.

ఇంకా నయం. అది తన జేబులో ఉన్నట్లుగా ఎవరూ చూడలేదు......!

అయినా తన జేబులో కదెలా వచ్చింది?

— 45 పేజీ చూడండి



[illegible]...నంగా ముందుకు వెళ్ళిపోతున్నారు. మనస్సు, మనస్సులో లేదు. తెలివిమాలిన ఆలోచనలు.......తెలియని వ్యూహాలు.......

రమాకాంతరావుగారు పిచ్చివారయ్యారు.

తాను పట్టుబడితే......?

కళ్ళముందు కటకటాల వెనుక చీకటిగది వూహా మాత్రంగా గోచరించింది !

—ఎవరూ చూడకుండా ఆ పర్సును ఎక్కడైనా పారెయ్యాలి !

ఎంత త్వరగా వీలయితే అంత త్వరగా ఆ పాపిష్టి వస్తువును తననుండి దూరం చేసుకోవాలి....

ఇదెక్కడి ఖర్మ తనకు......?

కాకినిక్కరేసుకున్న బలిష్టుడు తన వంకే చూస్తూ సైకిల్‌మీద పోతున్నాడు.

"సి. ఐ. డి. కాదుగదా?"

చటుక్కున ప్రక్కనున్న పార్కులోకి అడుగులు వేశారు. గుబురుగావున్న చెట్లు బరువుగా వూగుతున్నయి. ఒక్కక్షణం అటూ, ఇటూ చూచి, ఒకగుబురువెనుకగావున్న సిమెంటుబెంచీమీద కూలబడి భుజంమీదనున్న ఉత్తరీయంతో ముఖంపై జారుతున్న చెమట బిందువులను తుడుచుకున్నారు రమాకాంతరావుగారు.

"అనుమానంలేదు! దొంగిలించి పట్టుబడబోయే సమయంలో అది తన జేబులోకి జారవిడిచి తప్పుకున్నాడు ఆ దొంగ!"

ఒక్కసారి కళ్ళెత్తి నలువైపులా పరికించారు. దూరాన ఒక మూల ఇద్దరు యువకులు ఏదో విషయంమీద తీవ్రంగా చర్చించుకుంటున్నారు. పార్కు మధ్యలోఉన్న నీటికుండీవద్ద పిల్లలు గోలగా ఆడుకుంటున్నారు. ఆ చిన్నపార్కులోని రేడియోగొంతు వికృతంగా ఉన్నది.

పక్కజేబులోని పర్సు చేతిలోకి తీసుకుని విసిరివేయబోయారు. ప్రక్కనున్న గుబురు అల్లల్లాడింది.

చేయి వణికింది. పిడికిలి గుండెకు బలంగా హత్తుకుంది.

పొదలోని కుక్క రమాకాంతరావుగారివంక వింతగా చూస్తూ పరుగెత్తింది.

ఆయన దీర్ఘ నిశ్వాస విడిచారు. "హమ్మయ్య! మనిషేమోననుకున్నాను!" అని గొణుక్కున్నారు.

పిడికిలిలోని పర్సు బరువుగా ఉన్నది.

మళ్ళా దానిని పారవేయటానికి చేయెత్తబోయారు. కాని, ఆ పర్సులోని 'బరువు' ఆయనలో 'ఏదో' ఆలోచనను కలిగించింది.

"దాంట్లో ఏవుంది?"

"ఒక్కసారి చూస్తేను?"

ఆయన కళ్ళల్లోని చూపులు ఆయనలోని వింత వింత ఆలోచనలకు ప్రాణం పోస్తున్నాయి.

"తానెందుకు చూడగూడదు?"

ఆయన కొన్నిక్షణాలు స్తబ్ధంగా ఉండిపోయారు. ఆయన మొఖంలో వివిధ భావాలు దొర్లినయి. నుదుటి ముడతలు ఆలోచనాశక్తిని ఇనుమడింపజేసినయి. అవే ఆయనలోని భావ సంచలనానికి హేతువయ్యాయి.

నలుమూలలా పరిశీలించి చూచారు.......ఇంకా ఆ యువకులు వారి వాగ్వివాదంలోనే ఉన్నారు....

# అదృష్టవంతుడు

23-వ పేజీ తరువాయి

తోట మధ్యనున్న నీటికుండీ దగ్గర పిల్లలు గోల చేస్తూనే ఉన్నారు......ఎవరుపని వారిది!

"ఒట్టి తన భయంతప్ప మరేవీ లేదేమో?"

"అవ్వచ్చు......"

"అవును!"

కుడిచేత్తో ఆలావైన పర్సును బలంగా పట్టుకొని ఎడంచేత్తో భుజంమీద ఉత్తరీయం తీసుకొని మరొకసారి మొఖం తుడుచుకున్నారు.

అకస్మాత్తుగా తన మిత్రుడు చలపతి కళ్ళముందు మెదిలాడు. ఆయనలోని ఆలోచనలు మరొక్కసారి తీవ్రరూపం దాల్చినయి......చలపతి!......బట్టతల, ఆరడుగుల మనిషి, గ్లాస్కోపంచెమీద గ్లాస్కో లాల్చీ వేసుక్కొని, ఎప్పుడూ నోటినిండా కారాకిళ్ళీతో గంభీరమైన మొఖంమీద చిరునవ్వు చిందుస్తుండేవాడు..... ఆచలపతి ఇప్పుడు తన ఎదుట నిలబడిఉన్నట్లుగా అనిపించింది!

అతడు గుర్తుకొచ్చినప్పుడల్లా తన మొఖం చిన్నబోతుంది......తనకేగాదు.....అభిమానమున్న ఎవరికైనా అంతే!

ఒకరోజా! రెండు రోజులా?......రేపు శ్రావణ మాసానికి మూడు సంవత్సరాలు పూర్తిగా నిండుతయి. రాధ పెండ్లికి లగ్నాలు పెట్టించాడు, ఏదో తనకు తగిన సంబంధంచూచి. అనుకున్న సమయానికి డబ్బు అందకపోవటంతో పెండ్లికి చలపతిని తప్పక రమ్మనమని ప్రత్యేకంగా వ్రాస్తూ, "వచ్చేటప్పుడు ఒక నాలుగొందలు పట్టుకురా చలపతీ!" అని జాబు వ్రాశాడు.

నిజంగా ఆరోజు చలపతి ఆ సహాయం చేయకపోయినట్లయితే తను నలుగురులో అభాసై ఉండేవాడు!

కాని, అప్పటినుండి ఇప్పటివరకు ఆ బాకీ తీరుద్దామని ఎంత ప్రయత్నించినా తీర్చలేకపోతున్నాడు.

ఇంతకాలమైంది....ఏమనుకుంటున్నాడో ఏమో? అలా అనుకుండే వాడుగాదని తనకు బాగా తెలుసు....

అయినా తను ఇవ్వవలసిన ఆ డబ్బు అతడిలోని తన మీద గౌరవం తగ్గటానికి ఒకప్పుడు కాకపోయినా ఒకప్పుడైనా హేతువవుతుందనేది నిస్సందేహం!

ఈ పర్సులోని డబ్బుతో ఆ బాకీ తీరిస్తేనో?

అప్రయత్నంగా భార్య బోసిమెడతో కళ్ళముందు సాక్షాత్కరించింది.....

రాధ పెళ్ళయిన కొత్తల్లో ఏదో పండగ వచ్చింది... ఏదో గుర్తుకురావటంలేదు. తను అల్లుణ్ణీ, కూతుర్నీ పండక్కి అహ్వానింపవెళ్ళగా, జాలిగొలిపే మొఖంతో రాధ తనతో చాటుగా చెప్పింది......"ఈసారి మీ అల్లుడికి గడియారం కొనిపెడితేగాని రారట!" అని. దాని కళ్ళల్లో తిరుగుతున్న నీటినిచూచి విచలితుడయ్యాడు. ఫలితం తన భార్య మెడలోని రెండుపేటల గొలుసు మార్వాడీ భోషాణంలోకి వెళ్ళిపోయింది.

దానిని ఎప్పటికప్పుడు విడిపిద్దామనే అనుకుంటున్నాడు.

కాని ఎక్కడినుంచి డబ్బు తేగలడు?

ఎనభై రూపాయిల బడిపంతులు జీతం ఈ రోజుల్లో మామూలు తిండికే గగనమవగా, పైన వచ్చే నాలుగు ట్యూషన్ డబ్బులు పండగ పబ్బాలకు సరిపోతున్నయి!

ప్రస్తుతం ఆదాయానికి ఖర్చు సరిసమానంగా ఉన్నది.

చలపతి బాకీ తీర్చగా, ఏమైనా మిగిలితే దాని గొలుసు గూడా విడిపించాలి!

అనుకోకుండా హృదయం తేలికపడింది.


పర్సు తెరిచి చూడాలనిపించింది.

పర్సు తెరవబోతుండగా చేయబోయేపనికి మొఖం నల్లబడింది. తను తప్పు చేస్తున్నాడేమో?

ఈ రోజుల్లో ఏది తప్పు? ఏది న్యాయం?

న్యాయం న్యాయం అనుకోబట్టే తను పైలా పచ్చీసుగాఉన్న రోజుల్లో తనచుట్టూ తన చిరునవ్వు కోసం, చేతి విదిలింపు కోసరమూ, తిరిగినవాళ్ళు ఈ రోజున తననిచూచి, ముఖం ప్రక్కకు తిప్పుకుంటున్నారు.

ఒక్కసారి తన గడిచిన జీవితం గుర్తుకొచ్చింది. తన చుట్టూ తిరిగిన వ్యక్తులు గుర్తుకొచ్చారు. ఆయనలో ఏదో తెలియని ధైర్యం ఏర్పడింది. మన



ఏన్విల్

క్రిమి సంహారక ఆయింట్‌మెంట్

మొటిమలను, కురుపులను 'ఏన్విల్' మాన్పును.

'ఏన్విల్' కోతలకు, ఒరుపుళ్లకు, రక్కులకు కూడా అమోఘంగా పనిచేయును.

అట్లాంటిస్ (ఈస్ట్) లిమిటెడ్

(ఇంగ్లండులో స్థాపితం)




JWT-ANV-5313 RTE

AN 3

పామోలీవ్ లవెండర్

హుందాగాను... అందముగాను...

వుండు మనోహరమగు సువాసన!







ఇవి యిప్పుడు మీకు పామోలీవ్
టాల్కులో లభించును. కొంచెము
పామోలీవ్ లవెండర్ మీ చర్మము
మీద చల్లుకొన్నచో, ఉత్తేజపరచే
సువాసన మీ చుట్టూ వెదజల్లును.
పామోలీవ్‌ను వాడి ఎల్లప్పుడూ
తాజాగాను, ఆహ్లాదముగాను వుండండి.

పామోలీవ్ డీలక్స్-17 విదేశీ సువాసనలుగల మిశ్రమము!

PT. G. 6. TEL

# అదృష్టవంతుడు

న్నను ధ్రువపరుచుకున్నారు.

తను ఈ అవకాశాన్ని జారవిడుచుకోలేడు. ఇప్పుడు తన చేతిలో ఉన్నది.

ఈలాంటి అవకాశం జీవితంలో తన కెన్నడు రాకపోవచ్చును!

నిశ్చయంతో ఆ పర్సు తెరిచారు. ఆయన కళ్ళు జిగేలుమన్నాయి. అన్నీ వంద రూపాయి నోట్లు!

త్వర త్వరగా తీసి లెక్క వేశారు—ఎనిమి వందలు. ఆయన అమితానందం జెందారు.

తానెంతో అదృష్టవంతుడు. ఈ రోజు సుదినం తన జీవితంలో ఇవి మరువలేని ఘడియలు!

ఆనంద హృదయంతో ఆయనలేచి నిలబడ్డారు. డబ్బుతీసి విడిగా జేబులో కుక్కుకున్నారు. పర్సున పక్క పొదలోకి పారవేయబోయి, ఒక్కక్షణం ఆలోచించి, "ఇక్కడకాదు!" అనుకొని తిరిగి దానిని జేబులోనే వేసుకున్నారు.

రమాకాంతరావుగారు చిరునవ్వు మొఖంతో ఇంటివైపుకు వడి వడిగా అడుగులు వేశారు.

రోడ్డుమీద దీపాలు వింత వింత కాంతులను ప్రసరింపజేస్తూ, ఒక్కసారిగా వెలిగినయ్.

ఆయన మనస్సు ప్రపుల్లమయింది!

ఇందాక సంఘటన జరిగిన ప్రదేశంవద్దకు వచ్చినప్పుడు కొంత మనస్సు కలత బారింది. చటుక్కున తలవంచుకొని, గట్టిగా అడుగులు ముందుకు వేశారు.

అంత డబ్బు ఆ పర్సులో ఉండగా, పర్సు పోగొట్టుకున్న ఆ సిల్కు లాల్చీవ్యక్తి అతి నిర్లక్ష్యంగా కారు ఎక్కి కూర్చొని 'పోనీయ్' అని ఎందుకన్నాడో ఎంత ఆలోచించినా, రమాకాంతరావుగారికి అర్థం కాలేదు! అటు ఎనిమిది వందల రూపాయలను నిర్లిప్తంగా చూచిన అతని అంతస్థును ఒక పట్టాన వూహించుకోలేకపోయారు!!

హుషారుగా హాలులో కాలుపెట్టిన రమాకాంతరావుగారికి, "మీ సుపుత్రుడు! ఉత్తరం వ్రాశాడు" అంటూ జాబు అందించింది పేలవంగా నవ్వుతూ భార్య.

"ఏమని వ్రాశాడు?"

"చదువుకోండి......తెలుస్తుందిగా!" అని మొఖం పక్కకుతిప్పుకొని వంటింట్లోకి వెళ్ళిపోయింది.

రమాకాంతరావుగారు ఆత్రంగా చదవసాగారు.

"ప్రియమైన నాన్నగారికి నమస్కరించి శేషగిరి వ్రాయునది—

నా ఒంట్లో కులాసాగా ఉంటున్నది. నేను ఉంటున్న గదినుండి ట్రైనింగ్ స్కూలుకు వెళ్ళాలంటే చాలా ఇబ్బందిగా ఉన్నది. వాళ్ళు ఇచ్చే 'స్టైఫండ్'ను జాగ్రత్తగానే సర్దుకుంటున్నాను. అక్కడి పరిస్థితులు నాకు తెలిసినప్పటికి, మిమ్మల్ని ఒక కోరిక కోరకుండా ఉండలేకపోతున్నాను. ఇక్కడ ఒక సెకండ్‌హాండ్ సైకిల్ అమ్మకానికి వచ్చింది. ఎనభై రూపాయలల్లో ఇస్తానన్నాడు. ఏలాగైనా మీరు ఆ డబ్బు పంపగలిగితే కొనుక్కుందామనుకుంటున్నాను. దగ్గర గది ఎంత ప్రయత్నించినా దొరకలేదు. రోజూ మూడు మైళ్ళు నడకవలన ఎంతగా బాధ పడుతున్నా

వో నేను చెప్పలేను. నన్ను అపార్థం చేసుకోవద్దు. అమ్మగారికి నమస్కారములు. —శేషగిరి."

ఆ ఉత్తరం చదివేటప్పటికి ఆయన హృదయం ద్రవించింది. తనస్థితి తనకు గుర్తుకొచ్చి ఒక్క క్షణం దుఃఖించారు. "పిచ్చినాన్న!" అనుకున్నారు ఆర్ద్రనయనాలతో.

రుద్ధకంఠంతో, "విశాలా!" అని పిలిచారు భార్యను.

అలాపిలిచి ఎన్ని సంవత్సరాలైందో ఆయనకే గుర్తులేదు. ఈరోజు అప్రయత్నంగా ఆలా పిలిచారు. ఎందుకనో తన పిలుపు తనకే వెగటనిపించింది.

లోపలినుండి భార్యవచ్చి తలవంచుకు నిలబడింది.

"నాకు తెలును విశాలా! నీవు లోపలికి ఎందుకు వెళ్ళిపోయింది......ఈ ఉత్తరంచూచి, వాడిని తిడతా నని వూహించావుగదూ?......లేదు విశాలా లేదు! నేను నీవనుకున్నంత మూర్ఖుడినిగాదు ..... నన్ను పరిస్థితులే ఆలా చేస్తున్నాయి......ఏం చేస్తాం చెప్పు! కాని, ఈసారి వాడికోరిక తప్పకుండా తీరుస్తాను. రేపే ఒకవంద రూపాయిలు వాడిపేర పంపిస్తాను! ఇది నిజం విశాలా! తప్పకుండా పంపిస్తాను!" చాలా ఆవేశంగా అన్నారు రమాకాంతరావుగారు.

ఆమె ఆయన మాటలకు ఆశ్చర్యపోయింది!

తిరిగి ఆనందంగా తలఎత్తి భర్త మొఖంలోని వెలుగునుచూచి తృప్తిగా లోపలికి అడుగులు వేసింది.

వింత వింత ఆలోచనలతో ఆరాత్రి రమాకాంతరావుగారికి ఆయన జీవితంలో ఒక మరువలేని రాత్రి అయింది. జరిగిన సంగతంతా భార్యకు విపులీకరించారు.

"అలాచేయటం తప్పుగాదా? మీరూ నేరస్థుల క్రిందనే రావటంలేదా?......" అన్నది సంశయంగా.

దానిమీద ఒకగంటసేపు రమాకాంతరావుగారు భార్యకు ఏవేవో చెప్పారు. అలా చెబుతున్నప్పుడు ఆయనలో ఎన్నో భావాలు దొర్లినయి. ఆవేదనకు లోనయ్యారు. ఆవేశానికి పాత్రులయ్యారు. రాత్రి పన్నెండు గంటల సమయంలో ఆమె దీర్ఘ నిశ్వాసం విడిచి నిద్ర కుపక్రమించింది.

తెల్లవారి ఎనిమిది గంటలకల్లా అన్ని పనులూ పూర్తి చేసుకొని, ఉతికిన గుడ్డలు కట్టుకున్నారు రమాకాంతరావుగారు. ఇక పోస్టాఫీసుకువెళ్ళి, మిత్రుడు చలపతికి, శేషగిరికి డబ్బు పంపివేయాలి.

"ఆలస్యమయినందుకుగాను ఏమీ అనుకోవద్దని చలపతికి వ్రాయాలి!" అనుకున్నారు ఆయన.

తాను ఎన్నటికీ చేయలేనేమో అని భయపడుతున్న ఒకపని ఈరోజు అప్రయత్నంగా జరిగిపోతోంది.

తను ఒక తప్పు పని చేస్తున్నాడు. కాని, అలా చేయటానికి గూడా ఆయనలో తెలియని ఆత్మవిశ్వాసం, ధైర్యం పైన వైచుకొని, ఆ పనిలో ఆయనను ముందంజ వేయనిస్తున్నాయి.

రాత్రి డబ్బు పెట్టిన పెట్టెవద్దకు వెళ్ళారు. విడిగా పడేసిన ఎనిమిది వందరూపాయిల నోట్లలో ఐదు, విడిగా తన దగ్గరవున్న కొన్ని చిల్లర కాగితాలు తీసుకొని జేబులో పెట్టుకున్నారు.

కాలికి చెప్పులు తొడుక్కోబోతూ, ఎదురుగా వున్న దేవుని పటానికి నమస్కరించి, చెప్పులు తొడుక్కొని, "విశాలా! వెళుతున్నాను...... తలుపేసుకో!" అని హాలు తలుపు తీశారు.

కాని తలుపు తీసినవారు తీసినట్లే చలనరహితంగా వాకిట్లోకిచూస్తూ నిలబడిపోయారు!

వాకిట్లో గళ్ళచొక్కా తొడుక్కొని, జుట్టు చిందర వందరగా పడివున్న ఒక యువకుడు బెంచీమీద కూర్చొనివున్నాడు.

తలుపులు తీసిన రమాకాంతరావుగారిని చూస్తూనే లేచి నిలబడి, "నమస్కారమండీ!" అన్నాడు.

రమాకాంతరావుగారు అచేతనులయ్యారు...... ఆయన మేనుభయంతో కంపించింది.....

అతడిని ఎక్కడో తను చూచాడు.

ఎక్కడ?

అవును......నిన్న సాయంత్రం బజారులో ఆ సిల్కులాల్చీవ్యక్తి పర్సుపోయిందని అరచిన సమయంలో, పోలీసులు ఇతడినే గాబోలు యక్షప్రశ్నలతో దబాయించారు!

ఆ దృశ్యం గుర్తుకొచ్చిన మరుక్షణంలో ఆయన మొఖం పాలిపోయింది. తడబడ్డారు.

"ఎవరు......ఎవరు మీరు?"

అతడు చిరునవ్వు మొఖంతోనే, "నే నెవరో మీకు తెలియకపోవచ్చుగాని, మీరు నాకు బాగా తెలుసు! అన్నాడు.

"అయితే......?" అన్నారు భయంగా. ఆయన కనులు లోతుకుపోయినయి. ఆయన హృదయమేదో కీడు శంకిస్తోంది.

"ఆహార వ్యవహారాల్లో మానుడు పనికిరాదనేది నా అభిమతం రమాకాంతరావుగారు!......నిన్న సాయంత్రం ఒక విచిత్ర సంఘటన జరిగింది......అది విచిత్రం అనేందుకు మీరే సాక్షులు!"

అతడి మాటలకు రమాకాంతరావుగారు మరింతగా త్రుళ్ళిపడిపోయారు.

"నా నేర్పును చెప్పుకోవటానికి రాలేదుగాని, నా హస్తలాఘవంతో నిన్న ఒక బరువైన పర్సును నా దానిని చేసుకున్నాను......కాని నా దురదృష్టం— అతడు పసిగట్టి, "దొంగ దొంగ" అని అరిచాడు. అది నా సహచరులవద్దకుజేరే వ్యవధి గూడా లేకుండా నా పథకమంతా తారుమారైంది......ఆ సమయంలోనే ఆ పద్మాంధవుడిలా మా వీధిలోఉన్న మీరు నాకు కనబడ్డారు......ఫలితంగా నా చేతిలోది మీ జేబులోకి మీ అనుజ్ఞ లేకుండానే మారింది...... నే నెవరినో పోలీసువాళ్ళకు బాగా తెలుసు......నా దగ్గర పర్సు లేకపోయినప్పటికీ, వారితో రాత్రి పదిగంటల వరకు గడపవలసి వచ్చింది ...... ఆలాంటి బాంధవ్యం మాది!" నిర్లక్ష్యంగా ఆ యువకుడు నవ్వాడు.

"అబద్ధం!......పచ్చి అబద్ధం......!"

"అబద్ధం మాత్రంకాదు......అది పచ్చినిజం.... పోతే ఆ విషయం మీకు తెలియకపోవచ్చు......ఇంతవరకు మీరు మీ పక్కజేబులోకి చేయిపెట్టి ఉండకపోవచ్చు......తొందరేమీలేదు......ఇప్పుడైనా చూడండి! మీది నిప్పులాంటి స్వభావం అని నాకు తెలుసు!" అన్నాడు.

"నీ అనవసరపు మాటలు కట్టిపెట్టు...... నా జేబులో ఏలాంటి పర్సులేదని నాకు బాగా తెలుసు... నీవు నాకేం పాఠాలు చెప్పనక్కరలేదు!" కాస్త


## శ్రీబాలాంజనేయ ప్రశ్న

సంతానము, రోగములు, గ్రహబాధలు, వివాహం, పారిపోయిన పశువులు, మనుష్యులయొక్క ఆచూకీ, దొంగిలించిన సొమ్ము, వీడిపోయినభార్య మీరు కోరిన 5 ప్రశ్నలకు వెంట నే వ్రాసి పంపగలను. రూ 2 ఎం.ఓ. చేయండి. నెలలవారీగా 12 నెలలకు 1 సంవత్సరం జాతకము రూ 2. పూర్తిపేరు, జాబువ్రాసిన టైము తెలిపిన చాలును.

హనుమాన్ జ్యోతిషాలయము,
10వ లైను,అరండల్ పేట, గుంటూరు2.

## క్యాలెండర్లు

నాణ్యమైన ఫోటో అఫ్‌సెట్ క్యాలండర్లకు మమ్ము సంప్రదించండి. క్యాలండరు బొమ్మలను క్యాలెండరు మ్యాను ఫ్యాక్చరర్లకు, ప్రింటర్లకు ప్రత్యేక ధరలకు సప్లయి చేయుదుము.

మంచికమీషనుపై పని చేయుటకు సమరులైన ఏజంట్లు కావలెను. వ్రాయండి.

AJANTA ARTCALENDAR Mfg.Co.
*P. B. 255, MADRAS—1.*
or P. B 962, Calcutta-1.




## సినీతారల ఫోటోలు

మీ అభిమాన సినీతారల ఒరిజినల్ ఫోటోలు (నటీ, నటులవి) అందమైన పోజులలో కార్డు సైజు డజను వెల రు. 5/-. పోస్టేజి రు. 1/- అదనం.

CINE PHOTO
DISTRIBUTORS

(P.O.) RELANGI (W.G.)

ందొక్కుకొని రమాకాంతరావుగారు హెచ్చుస్వరంతో అన్నారు.

తను కట్టుకున్న మేడలన్నీ కూలిపోవుగదా?

అలాంటి ఆలోచనకు ఆయన భయకంపితు లయ్యారు.

అతడు ఒక్కక్షణం నిశ్శబ్దంగా వూరుకొని, తల ఎత్తాడు. సూటిగా తనవంకే చూస్తున్న రమాకాంత రావుగారి మొఖంలోకి చూచాడు. అతడిమొఖంలో రమాకాంతరావుగారికి ఏదో మార్పు గోచరించింది.

అతడు గొంతు హెచ్చించి, "మర్యాదగా ఇచ్చిన అవకాశాన్ని వినియోగించుకోలేకపోయారని చెప్పటా నికి విచారిస్తున్నాను రమాకాంతరావుగారూ!...... ఇక చెప్పవలసిన నాలుగు మాటలు చెబుతాను వినండి... అనవసర కాలయాపన చేయటం నా అభిమతంకాదు... మీ రెప్పుడైనా రౌడీ రంగడిపేరు విన్నారా?"

"విన్నాను!" అన్నారు పెగుల్చుకొని భయంగా.

"అయితే అతడినే ......నేను!" ఆ కంఠం భయంకరంగా ఉన్నది.

రమాకాంతరావుగారు ఉలిక్కిపడి తలెత్తి అతడి మొఖంలోకి చూచి, మరుక్షణంలోనే తలదించు కున్నారు.

అతడి కళ్ళు నిప్పులు కురిపిస్తున్నాయి!

ఆ కళ్ళవెనుకవున్న చూపులు అతడు చేసిన అత్యా చారాలను ప్రతిబింబిస్తున్నాయి.

తను ఇప్పుడు రౌడీ రంగడిముందు నిలబడి ఉన్నాడు అని అనుకున్నప్పుడు ఆయనకాళ్ళు వణికి నయ్!

రౌడీ రంగడు!

కళ్ళు గిర్రున తిరిగినయ్!

రెండు నిముషాలు అతి భయంకర నిశ్శబ్దం ఆ వరండాలో ఆవరించింది.

అతడు గొంతు తగ్గించి, "ఇక నేనేవీ చెప్పాల్సిన అవసరం లేదనుకుంటాను......ఇంత చిన్న విషయం కోసరంగాను మిమ్మల్ని మీరు నాశనం చేసుకునేం దుకు నిర్ణయించుకుంటారని నేను అనుకోను...... ఇచ్చేది, లేంది ఒక్కమాట చెప్పండి!" అన్నాడు.

అంత భయంకర రూపం మరుక్షణంలోనే చిరు నవ్వుతో ఫక్కుమన్నది!

రమాకాంతరావుగారితల తిరిగిపోయింది.

తన నాశనం?!

రౌడీ రంగడు ఎంతకైనా సమర్థుడు!

మిత్రుడు చలపతి మదిలో మెదిలాడు. బోసి మెడతో భార్య దీనంగా చూచింది. జాలిగొలిపే శేషగిరి మాటలు కళ్ళముందు కదిలినయి.

తను ఏంచేయాలి!

ఇక తను ఏ విధంగానూ అతడిని బుకాయించ లేడు.......తనకేలాంటి అన్యాయం చేయాలనుకున్నా అతడి కది గోటితో మీటినంత పని!

చూస్తూ, చూస్తూ చేతికొచ్చిన ఎనిమిదివంద రూపాయిలు ఏలా వదులుకోగలడు?

మనస్సు అర్థహీనంగా విలపించింది. తను ఏలాంటి అసపరిస్థితిలో ఉన్నాడు?

అంతా తన ఖర్మ!

ఈరోజు ఈ అనుకొని ధనార్జనతో జీవితంలోని ఈ కాస్త ప్రశాంతతను గూడా పోగొట్టుకోలేడు!

# అదృష్టవంతుడు

తిరిగి మరొసారి మిత్రుడు చలపతి గంభీర విగ్రహం కళ్ళముందు కదిలింది. విశాలమొఖం తనవంకే దీనంగా చూస్తోంది. శేషగిరి జాలిగొలిపే నేత్రాలు తనవంకే చూస్తున్నయి—పీటనన్నిటిని కనుమరుగుచేసే రౌడీరంగడి చూపులను తను మరువ లేడు!

క్షణంలో గంభీరులయ్యారు. మనిషి నిట్ట నిటా రుగా నిలబడి వెనుదిరిగారు. ఆయన మొఖం ఎర్ర బారింది. ఆయన దృఢచిత్తులయ్యారు.

ఆ పాపిష్టిడబ్బు తన కక్కరలేదు! తన స్వశక్తిమీద తన జీవితా జీవితాన్ని సుఖప్రదం చేసుకోగలడు.

అడుగులు లోపలికి వేశారు.

అప్పటివరకు తలుపు వెనుక నిలబడివున్న విశా లాక్షి చటుక్కున వెనుదిరిగి తలవంచుకొని వంట ఇంటిలోనికి వెళ్ళిపోయింది.

ఆమె మొఖం చూచినప్పుడు రమాకాంతరావు గారు నిరాశ, నిస్పృహలకు లోనయ్యారు. "నేను అసమర్థుడను విశాలా! ఎందుకూ పనికిరాను!" అనుకున్నారు నిట్టూరుస్తూ, నీరసంగా.

"రమాకాంతరావుగారు! మీమీద నమ్మకున్నప్ప టికీ, మరోసారి హెచ్చరిస్తున్నాను......దానిలో ఎంత ఉన్నదో నాకు తెలుసు. మరింక కాలయాపనకు అవకాశమివ్వకుండా అంతా ఇస్తారనే ఆశిస్తున్నాను!"

రమాకాంతరావుగారు ఒక్కసారి వెనుదిరిగి ఏహ్యంగా అతడివంకచూచి, వడివడిగా లోపలికి అడుగులువేసి, పెట్టెమూత తెరిచారు. జేబులోని ఐదొందలు, విడిగావున్న మూడువందలు పర్సులో పెట్టి, పెద్ద పెద్ద అంగలతోవెళ్ళి అతడి చేతిలో పెట్టి, "చూచుకో!" అన్నారు క్రోధంగా.

అతడు లేచి నిలబడుతూ, "చూచేందుకు అందులో ఎంత ఉన్నదో నాకు తెలిస్తేగదా రమా కాంతరావుగారూ!" అని పెద్దపెట్టునవ్వి, "వస్తా నండీ!" అని నమస్కారంచేసి, హడావుడిగా వాకి ట్లోకి వెళ్ళిపోయాడు.

అతడు పోతున్నవైపే నోరు తెరుచుకొని, అలాగే చూస్తూ, నిర్లిప్తంగా ఆ బెంచీమీద కూలబడి పోయాడు రమాకాంతరావుగారు ఆ క్షణంలోనే!

పది గంటలకు ఇంకా పావుగంట ఉండనగా విశా లక్ష్మి గొంతువిని, కలతబారిన హృదయంతో మౌనంగా నాలుగు మెతుకులు నంజి, మ్లానవదనం తోనే బడికి బయల్దేరారు రమాకాంతరావుగారు.

ఆయన మనస్సు మనస్సులోలేదు. పూర్తిగా కలత జెందింది.

ఆ సొమ్ము తనదిగాదని తెలుసు......కాని, అది తనకు దక్కలేదనే నీరసభావంలోకి దిగజారిపోతు న్నారు.

"అన్యాయార్జితం నిలవదనేది నిరూపించబడింది!" అనుకున్నారు.

అసలు ఆ సొమ్ము తన దరిజేరకుండా ఉండ వల్సింది.

లేనిపోని మానసిక కల్లోలం!

తల దిమ్మెక్కే ఆలోచనలతో అలాగే నడుస్తు న్నారు.

బజారులో కాలుపెట్టి తలవంచుకొని, దాటి పోబోతూ, దూరానవున్న గుంపుగా కూడిన జనాన్ని ఆసక్తిగా చూడకుండా ఉండలేకపోయారు.

మరేమైనా దొంగతనం జరిగిందా?

ఆ చికాకులో గూడా నవ్వుకోకుండా ఉండలేక పోయారు!

అయినా చూదామనే ఉద్దేశ్యంతో అటు నాలుగు అడుగులువేసి, ఆ గుంపులోకి చూచి, అమి తాశ్చర్యం జెందారు!

అతడే!!

ఉదయం తన ఇంటికివచ్చి, దబాయించి, ఎని మిదివందల రూపాయిలతోవున్న పర్సును తీసుకొని వెళ్ళిన ఆ గళ్ళచొక్కా యువకుడే!

ఇద్దరు పోలీసులు అతడి చేతులను చెరొకపక్క పట్టుకొని బలంగా లాక్కువెళుతున్నారు!

రమాకాంతరావుగారు నిశ్చేష్టులై తేరుకొని, అక్క డే నిలబడివున్న ఒక వ్యక్తిని "ఏమిజరిగింది?" అని అడిగారు.

"వందరూపాయిల దొంగనోట్లను మారు స్తుంటే పోలీసులు పట్టుకున్నారు!

తాను ఎలాంటి గండంనుండి బయటపడ్డాడు?... నిజంగా తానెంత అదృష్టవంతుడు!

రమాకాంతరావుగారికి అప్పు డర్థమయింది — అంత డబ్బు పర్సులో ఉన్నప్పటికీ, పర్సు పోగొట్టు కున్న ఆ సిల్కులాల్చీ వ్యక్తి అతి నిర్లక్ష్యంగా కారు ఎక్కి కూర్చుని, "పోనియ్!" అని ఎందుకన్నాడో!

ఒక్కక్షణం గుండె అమితవేగంగా కొట్టుకొని మరుక్షణంలోనే తేలికయింది. శాంతికి కరువైన మనస్సు ఆహ్లాదంతో నిండిపోయింది! ★

---

ఒక ప్రఖ్యాత రచయిత దయ్యాల కథలు రాస్తాడని పేరు పొందాడు. ఒకనాడు రెండో ఆటనించి వస్తున్నాడు అతను. ఒక పాఠకుడు రచయితను అమాంతం సందు మలుపులో కౌగలించుకున్నాడు. రచయిత గుండె ఝల్లుమంది. దయ్యమనుకుని హడలిపోయి పారి పోయాడు. ఆ మర్నాడు జ్వరంతోనే ఓ కథ రాశాడు. ఆ కథకి తొలి బహుమానం వచ్చింది.

రాజరాజు (రాజమండ్రి)

---